సాక్షి
సిద్దిపేట
శనివారం । 25 । నవంబర్ । 2023



కాళేశ్వరంపై దుష్ప్రచారం..
కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై బీజేపీ నేతలు విషప్రచారం చేయడం సిగ్గుచేటని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వివరాలు 8లో ▸

కల నెరవేరేనా?
అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పార్టీల అస్త్రం దుబ్బాక రెవెన్యూ డివిజన్. గెలిపిస్తే కల నెరవేరుస్తామని బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలు చెబుతున్నారు. వివరాలు 8లో ▸





మరోసారి ఆశీర్వదించండి..
హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశానని.. ప్రజలు మరోసారి ఆదరించి భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్ కోరారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

కాంగ్రెస్, బీజేపీలకు ఓటుతో బుద్ధి చెప్పండి

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ



చిన్నకోడూరు రోడ్‌షోలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): ఢిల్లీ పెద్దలకు సద్దులు మోసే బీజేపీ, కాంగ్రెస్‌లకు ఓటు వేస్తే తెలంగాణ అంధకారమవుతుందని, ఆ రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. శుక్రవారం రాత్రి చిన్నకోడూరులో బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి హరీశ్‌రావుకు మద్దతుగా భారీ రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాక ముందు సమైక్యపాలనలో నీళ్ల కోసం, కరెంట్ కోసం అరిగోసపడ్డామన్నారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణను సీఎం కేసీఆర్ అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దారన్నారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చూసి మరోసారి మంత్రి హరీశ్‌రావును ఆశీర్వదించాలన్నారు. సిద్దిపేట గౌరవాన్ని ఎల్లలు దాటించిన నాయకున్ని మెజార్టీలో మరింత ఎత్తుకు పెంచుదామన్నారు. సమావేశంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, సర్పంచ్ ఉమేష్ చంద్ర, సొసైటీ చైర్మన్‌లు కనకరాజు, సదానందం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

సిద్దిపేటకమాన్: ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ధనస్వామ్యాన్ని బద్దలు కొట్టండి ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టండి అని జై భారత్ జస్ట్ ఓట్ క్యాంపెయిన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో వారు పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. ఓటును అమ్ముకోవడం ద్వారా ఐదేళ్లు మోసపోతామన్నారు. ఓటర్లను జైభారత్ జాగృతం చేస్తోందని అన్నారు. సమావేశంలో లోక్‌నాథ్, సత్యనారాయణ, స్వతంత్ర అభ్యర్థి సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలను తిప్పికొడదాం



మాట్లాడుతున్న ముస్లిం ప్రతినిధులు

సిద్దిపేటజోన్: మైనార్టీలకు ప్రభుత్వం ఏమీ చేయలేదని కొందరు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని సిద్దిపేట మైనార్టీ ప్రతినిధులు అన్నారు. శుక్రవారం బాబ్ జానీ, ఆదాబ్ మోహిజ్, అసిఫ్, శౌకత్ విలేకరులతో మాట్లాడుతూ ముస్లిం మైనారిటీలు ఏకతాటిపైకి వచ్చి మంత్రి హరీశ్‌రావుకు మద్దతు తెలపాలన్నారు. అండగా ఉండి, లక్షన్నర మెజార్టీ సాధించడంలో భాగస్వామ్యం కావాలని సూచించారు. సిద్దిపేటలో అత్యద్భుతంగా హజ్‌హౌస్‌ను మంత్రి నిర్మించారన్నారు. పట్టణ శివారులలో సొంత డబ్బులతో మూడు ఎకరాల భూమిని కొని ఇచ్చారన్నారు. సిద్దిపేట ప్రగతిని దేశ వ్యాప్తంగా విస్తరించి, రాష్ట్రానికి రోల్ మోడల్‌గా నిలిపిన మంత్రి హరీశ్‌రావుకు ముస్లిం మైనారిటీల అండ ఎప్పుడూ ఉంటుందని అన్నారు.

పీజీలో స్పాట్ అడ్మిషన్లు

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల పీజీ (ఎమ్మెస్సీ మైక్రో బయాలజీ)లో విద్యనభ్యసించేందుకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ ఉమాశశి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీజీ ఎంట్రెన్స్‌లో అర్హత సాధించిన వారితో పాటు టెస్ట్ రాయనివారు, డిగ్రీలో 55 శాతం మార్కులు పొందిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల విద్యార్థినులు నేడు (శనివారం) పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లో గల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నేరుగా సంప్రదించాలని సూచించారు.

'పెందోట'కు బాల సాహిత్య పురస్కారం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బాల సాహితీవేత్త పెందోట వెంకటేశ్వర్లకు పుట్టగుంట బాల సాహిత్య పీఠం బాల సాహిత్య పురస్కారాన్ని 2023 ప్రకటించినట్లు బాలసాహితీవేత్త ఉండ్రాళ్ల రాజేశం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పురస్కారాన్ని డిసెంబర్ 10న హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో అందజేయనున్నట్లు తెలిపారు.





శుక్రవారం హుస్నాబాద్‌లో జరిగిన విజయభేరి సభలో మాట్లాడుతున్న ప్రియాంకగాంధీ చిత్రంలో పొన్నం ప్రభాకర్, సభకు హాజరైన ప్రజలు

కాంగ్రెస్‌తోనే సంక్షేమం

పథకాలపై నాది 'గ్యారంటీ'
- కేసీఆర్ పాలనలో నిరుద్యోగులు రోడ్డుపాలు
- 'గౌరవెల్లి' పూర్తి చేయడంలో సర్కార్ నిర్లక్ష్యం
- పొన్నం గెలిస్తే హుస్నాబాద్‌కు మెడికల్ కళాశాల
- కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ

హుస్నాబాద్: ప్రజల సంక్షేమం కాంగ్రెస్ పాలనలోనే సాధ్యమని పార్టీ అగ్రనేత ప్రియాంక గాంధీ అన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో ప్రజలు సంతోషంగా లేరని, బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని మార్చాలని ఆమె పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాల అమలు 'గ్యారంటీ' అని అన్నారు. హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌ను గెలిపించాలని ఆకాంక్షిస్తూ శుక్రవారం పట్టణంలో కాంగ్రెస్ విజయ భేరి సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రియాంకా గాంధీ పాల్గొని ప్రసంగించారు. ఈ ప్రాంత చిరకాల స్వప్నమైన గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. అలాగే గండిపెల్లి, తోటపల్లి ప్రాజెక్టులను పూర్తి చేయలేదన్నారు. రైతుల నుంచి బలవంతంగా భూములను లాక్కుని పరిహారం ఇవ్వలేదన్నారు. విద్యా, ఉద్యోగ అవకాశాలు కల్పించకపోవడంతో నిరుద్యోగులు రోడ్డు పాలయ్యారన్నారు. సీఎం కేసీఆర్ దత్తత తీసుకున్న చిన్న ముల్కనూర్ గ్రామం సైతం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వకుండా భూములను గుంజుకొని దాడులు చేస్తుంటే ఇక్కడి ఎమ్మెల్యే ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. ప్రజలను కలవలేని ఈ ఎమ్మెల్యే అవసరమా అని ప్రశ్నించారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని తెలిపారు. పేపర్ లీకేజీలతో నిరుద్యోగుల భవిష్యత్ అగమ్యగోచరంగా మారిందన్నారు. ఏ ప్రభుత్వ ఆఫీస్‌కు వెళ్లినా అవినీతిమయమైందని, ప్రాజెక్టులల్లో పెద్ద స్థాయిలో అవినీతి జరిగిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేసితీరుతామన్నారు. ఇందిరమ్మ హయాంలో ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు కట్టించగా ఇప్పటికీ ఆమెను గుర్తు చేసుకుంటున్నారని తెలిపారు. అలాగే తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గుర్తించి ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీని తల్లిలా గౌరవిస్తున్నారన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే హుస్నాబాద్‌లో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేస్తామని ప్రియాంక గాంధీ హామీ ఇచ్చారు.

వర్షం కురుస్తున్నా మీ కోసం వచ్చా..

వాతావరణం అనుకూలించకపోయినా, అధికారులు వారించినా మిమ్మల్ని చూసేందుకు వచ్చానని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత ప్రియాంకా గాంధీ అనడంతో ప్రజలు ఒక్కసారిగా చప్పట్లతో హర్షధ్వానాలు చేశారు. మధ్యాహ్నం 12.30కు సభకు రావల్సి ఉండగా, 4.30 గంటలకు హెలికాప్టర్‌లో హుస్నాబాద్‌కు చేరుకున్నారు. అయినా ప్రజలు అలాగే వేచి చూడటం గమనార్హం. ప్రియాంక గాంధీ రావడం, సభ సక్సెస్ కావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది.

కేసీఆర్ ఉద్యోగం పోతేనే..
తెలంగాణలో ఖాళీగా ఉన్న 2.50లక్షల ఉద్యోగాలు రావాలంటే కేసీఆర్ ఉద్యోగం పోవాలని కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అన్నారు. మరో నాలుగు రోజుల్లో బీఆర్‌ఎస్ కాంగ్రెస్ పార్టీపై దుష్ప్రచారం చేసే అవకాశం ఉందన్నారు. రైతుకు ఋణ మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదన్నారు. పక్కనున్న ఎమ్మెల్యే ఇక్కడకు అభివృద్ధి చేస్తామని చెప్పడం సతీష్‌కుమార్ అసమర్థతకు నిదర్శనమన్నారు. 40 ఏళ్ల క్రితం ఇందిరాగాంధీ హుస్నాబాద్‌కు వస్తే మళ్లీ ఇప్పుడు అభినవ ఇందిరాగాంధీ వచ్చారని గుర్తు చేశారు.

ప్రజలను కలవని సీఎం: చాడా
పదేళ్ల కాలంలో ప్రజలను కలవని సీఎం ఎవరైనా ఉన్నారనంటే అది కేసీఆరే అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. లక్షల కోట్ల రూపాయలతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తే మూడేళ్లల్లోనే కుంగిపోయిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు, ఏఐసీసీ కార్యదర్శి క్రిష్టోఫర్ తిలక్, నియోజకవర్గ పరిశీలకుడు గోపినాథ్, నాయకులు పాల్గొన్నారు.

ఇప్పటి వరకు రూ.2.12 కోట్లు పట్టివేత

- రూ. 3.20 కోట్ల విలువైన మద్యం స్వాధీనం
- 13.7కిలోల వెండి , 300 కిలోల గంజాయి సీజ్
- కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్



సిద్దిపేటరూరల్: ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ లలో శుక్రవారం నాటికి రూ.2 కోట్ల12 లక్షల నగదును పట్టుకున్నట్లు కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ తెలిపారు. అలాగే రూ.3 కోట్ల 20 లక్షల విలువైన రెండున్నర లక్షల లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. 13.7 కిలోల వెండి, 300 కిలోల గంజాయిని సీజ్ చేసినట్లు తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్నందునా చెక్ పోస్టులవద్ద సిబ్బందిని మరింత అప్రమత్తం చేశామన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌తో ఓటు వేసిన 1875 మంది
ఎన్నికల విధులు నిర్వహిస్తున్న 1875 మంది ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ తెలిపారు. జిల్లాలో ఓటు ఉండి ఇతర జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న 2101 మంది ప్రభుత్వ ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్స్ ను పంపించామన్నారు. అదేవిధంగా ఇతర జిల్లాలో ఓటు ఉండి బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు శనివారం సిద్దిపేట కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కేంద్రంలో ఓటు వేయాలని కలెక్టర్ కోరారు.

జిల్లా ఏర్పాటుకు గిరిగీసి కొట్లాడిన

- నేడు అభివృద్ధి కోసం పని చేస్తా..
- చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధనకు మరో ఉద్యమం
- 'సాక్షి'తో బీజేపీ జనగామ అభ్యర్థి ఆరుట్ల దశమంతరెడ్డి



జనగామ: జనగామ జిల్లా ఏర్పాటు కోసం అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని గిరిగీసి కొట్లాడిన.. లాఠీ దెబ్బలు తిన్నా.. జైలు గోడలను ముద్దాడానని బీజేపీ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి ఆరుట్ల దశమంతరెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గురువారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు. వివరాలు అయన మాటల్లోనే..

జిల్లా సాధన ఉద్యం జరుగుతున్న సమయంలో ఈ ప్రాంత పౌరుషాన్ని భువనగిరి జిల్లాలో తాకట్టు పెట్టాలని చూసిన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిని మూడు నెలల పాటు ఈ గడ్డపై అడుగు పెట్టనివ్వలేదు. గిరిగీసి కొట్లాడుతూ.. ఆమరణ దీక్ష చేపట్టి జిల్లా సాధించుకున్నాం. అదే స్ఫూర్తితో ప్రజలు ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తా. స్థానికేతరుడు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పరిపాలనలో ఈ నియోజకవర్గం భ్రష్టుపట్టిపోయింది. ఆయన రాజకీయ దృక్పథంతో కాకుండా.. కేవలం వ్యాపార పరంగా ఆలోచన చేయడంతో జనగామ కించిత్తైనా అభివృద్ధి సాధించ లేదు. బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్సీగా ఉండి ఈ ప్రాంతానికి ఏమీ చేయలేదు. 2008లో చేర్యాల ఎమ్మెల్యేగా ఉన్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి.. ఆ ప్రాంత నియోజకవర్గం కనుమరుగై పోతుంటే కాపాడలేకపోయాడు.. ఇప్పుడు గెలిపిస్తే అభివృద్ధి చేస్తామనడం హాస్యాస్పదంగా ఉంది. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా బస్టాండ్‌కు సమీపాన కలెక్టరేట్ నిర్మాణం జరిగిందంటే.. కేవలం నాకృషి వల్లే. అక్కడ నివాసముంటున్న పేదలకు నచ్చజెప్పి బాణాపురంలో 220 మందికి డబుల్ బెడ్రూం ఇళ్లు వచ్చేలా కలెక్టరేట్‌కు ఉన్న అడ్డంకులను తొలగించాం.

జనగామ కీర్తి ప్రతిష్టను పెంచుతా..
జనగామ, చేర్యాల మున్సిపల్, ఎనిమిది మండలాలను అభివృద్ధి చేసి నియోజకవర్గ కీర్తి ప్రతిష్టలను పెంచుతా. జనగామ పట్టణ డ్రెయినేజీ నీరు నెల్లుట్ల చెరువులోకి వెళ్లేవి. బతుకమ్మకుంట ప్రాంతంలో ఎమ్మెల్యే అనుచరుల రియల్ ఎస్టేట్ మూలంగా 12 పీట్ల ఎత్తులో ఉన్న యశ్వంతాపూర్ వాగులోకి తీసుకు వెళ్లాలనే దౌర్భాగ్యమైన నిర్ణయం తీసుకున్నాడు. దీంతో కోర్టు మెట్టికాయలు వేసి స్టే ఇవ్వడంతో ఆ నీరు ఎటు వెళ్తుందో ఎవరికీ తెలియని పరిస్థితి. తాను గెలిస్తే వీటన్నింటికీ పరిష్కారం చూపిస్తా. నరేంద్రమోదీ నాయకత్వంలోనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయి. ఎరువులు, డీఏపీ తదితర వాటికి ఎకరాకు రూ.18వేలు, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి రూ.6వేలతో పాటు పెరిగిన ధాన్యం పెట్టుబడితో ఒక్కో రైతుకు ఏడాదికి రూ.50 వేల మిగులు బాటు అవుతుంది. తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉచితంగా బియ్యం ఇచ్చేందుకు ప్రధాన మంత్రి నిర్ణయం తీసుకున్నారని తెలిపారు.

రెవెన్యూ డివిజన్ సాధనే లక్ష్యం

పరిపాలనా సౌలభ్యం కోసం చిన్న జిల్లాలు చేసిన సీఎం కేసీఆర్.. చేర్యాల ప్రజలు రెవెన్యూ పనుల కోసం సిద్దిపేటకు.. విద్యుత్ సమస్యలపై గజ్వేల్, పోలీసుకు సంబంధించి హుస్నాబాద్, కోర్టు కోసం జనగామకు వెళ్లే పరిస్థితులను తీసుకువచ్చారు. తాను ఎమ్మెల్యేగా గెలుపొందగానే చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధించేందుకు మరో పోరాటం చేస్తాం.

కురిసిన జల్లులు.. తడిసిన ధాన్యం



తడిసిన ధాన్యాన్ని చూపుతున్న మహిళా రైతు

సిద్దిపేటరూరల్: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం శుక్రవారం కురిసిన వర్షానికి తడిసిపోయింది. రెండు రోజుల నుంచి మేఘావృతంగా ఉండడంతో గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అప్రమత్తంగా ఉన్న రైతులు ముందస్తుగా టార్పాలిన్లు కప్పుకుని ధాన్యం తడవకుండా చేశారు. వేగంగా ధాన్యం సేకరణ ప్రక్రియ జరగాలని రైతులు కోరుతున్నారు.

అప్పనపల్లిలోనూ..
దుబ్బాకరూరల్: మండలంలోని అప్పనపల్లిలోనూ కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వరి ధాన్యం తడిసి పోయింది. వర్షానికి సంచుల్లో నింపిన ధాన్యం సైతం తడిసి పోయింది.

అభివృద్ధి, సంక్షేమాన్ని గడపగడపకూ తీసుకెళ్లండి

- గజ్వేల్‌లో వచ్చిన మార్పును వివరించండి
- కేసీఆర్ భారీ మెజారిటీకి బాటలు వేయండి
- బీఆర్‌ఎస్ నాయకులకు, కార్యకర్తలకు మంత్రి హరీశ్‌రావు పిలుపు

గజ్వేల్: అభివృద్ధి, సంక్షేమాన్ని గడపగడపకూ తీసుకెళ్లి సీఎం కేసీఆర్‌కు భారీ మెజారిటీ వచ్చేలా పనిచేయాలని మంత్రి హరీశ్‌రావు బీఆర్‌ఎస్ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు బీఆర్‌ఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా అధికార ప్రతినిధి పండరి రవీందర్‌రావు నేతృత్వంలో గులాబీ గూటికి చేరారు. వీరికి మంత్రి హరీశ్‌రావు హైదబాద్‌లోని తన నివాసంలో కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ కేసీఆర్ ప్రాతినిథ్యం కారణంగా గజ్వేల్ నియోజకవర్గం అభివృద్ధిలో యాభైఏళ్ల ముందుకు వెళ్లిందని చెప్పారు. ఇక్కడ నిర్మించిన కొండపోచమ్మసాగర్, ఫారెస్ట్రీ కళాశాల, హార్టికల్చర్ యూనివర్సిటీ, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో నిర్మించిన రింగురోడ్డు, ఏరియా, మాతాశిశు సంరక్షణ ఆస్పత్రి, ఎడ్యుకేషన్ హబ్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ తదితర అభివృద్ధి పనులు రాష్ట్రానికే తలమానికంగా నిలిచాయన్నారు. గతంతో పోలిస్తే గజ్వేల్‌లో ప్రస్తుతం వచ్చిన మార్పును ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలు, నాయకులపై ఉందన్నారు. తొమ్మిదిన్నరేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి, సంక్షేమం పరిఢవిల్లుతోందని చెప్పారు. ప్రభుత్వ పథకాలతో గ్రామీణ సమాజంలో గొప్ప పరివర్తన వచ్చిందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మోసపూరిత విధానాలతో ప్రజల్లోకి వస్తున్నాయని, వారి దుష్ప్రచారాలను ఎక్కడికక్కడ ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షులు మధు, జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు అరిగె అశోక్‌కుమార్, నాయకులు కొడిత్యాల భాస్కర్, వేణుమనోహర్‌రావు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

అభివృద్ధి ప్రదాతకు అండగా నిలుద్దాం



నర్సాపూర్‌లో మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ చెర్మన్ రాజనర్సు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి హరీశ్‌రావును భారీ మెజార్టీతో గెలిపిద్దామని మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు అన్నారు. శుక్రవారం పట్టణంలోని 2వ వార్డు పరిధిలోని నర్సాపూర్, 3వ వార్డు పరిధిలోని రంగథాంపల్లిలో హరీశ్‌రావుకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా వార్డులలోని అన్ని కుల సంఘాల నాయకులు ఏకగ్రీవంగా హరీశ్‌రావుకు మద్దతు ప్రకటిస్తున్నామని ఏకగ్రీవ తీర్మానపత్రాలను అందించారు. కార్యక్రమంలో రైతు బంధు జిల్లా అధ్యక్షుడు వంగ నాగిరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ కనకరాజు, కౌన్సిలర్లు నాయిని చంద్రం, వంగ రేణుకా తిరుమల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు కొరే ఎల్లయ్య, రాజు, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు మంచి ఆదరణ
నంగునూరు/సిద్దిపేటఅర్బన్/సిద్దిపేటరూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో బీఆర్‌ఎస్ మంచి ఆదరణ లభిస్తోందని బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు లింగంగౌడ్, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాల్లో హరీశ్‌రావుకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. అలాగే హరీశ్‌రావుకు మద్దతుగా ఎల్లుపల్లిలో సర్పంచ్ జయశ్రీ రమేష్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అలాగే రాఘవాపూర్‌లో ఎంపీపీ శ్రీదేవి చందర్‌రావు, సర్పంచ్ రమేష్, సురేశ్, నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

- సిద్దిపేట సీపీ శ్వేత
- పోలీస్ సిబ్బందికి దిశానిర్దేశం

రాయపోలు(దుబ్బాక): సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు సీపీ శ్వేత తెలిపారు. శుక్రవారం రాయపోలు, బేగంపేట పోలీస్ స్టేషన్లను గజ్వేల్ ఏసీపీ రమేశ్‌తో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. సీపీ మాట్లాడుతూ శాంతియుతంగా ఎన్నికల నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. గత ఎన్నికల్లో ఘర్షణలు చోటుచేసుకున్న గ్రామాలపై ప్రత్యేకంగా నిఘా పెట్టాలన్నారు. కార్యక్రమంలో తొగుట సీఐ కమలాకర్, రాయపోలు, బేగంపేట ఎస్‌ఐలు రఘుపతి, అరుణ్ కుమార్, పోలీస్‌సిబ్బంది ఉన్నారు.

బల్క్ మెసేజ్‌లు పంపితే చర్యలు
సిద్దిపేటకమాన్: పోలింగ్‌కు 48 గంటల ముందు బల్క్ మెసేజ్‌లు సోషల్ మీడియాలో పోస్ట్ చేసినా, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ శ్వేత తెలిపారు.

జరిమానా..
బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తికి జరిమానా విధించారు. సీపీ శ్వేత తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని గాంధీనగర్ కు చెందిన వంగ ఐలేష్ (45) తన ఇంటి వద్ద అక్రమంగా బెల్ట్ షాపు నిర్వహిస్తుండడంతో గతంలో పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఎన్నికల నిబంధనలు అమల్లో ఉండడంతో అతడిని పోలీసులు బైండోవర్ చేశారు. నిబంధనలు ఉల్లంఘించడంతో అతడిని స్థానిక తహసీల్దార్ ఎదుట హాజరుపరచగా విచారణ జరిపి రూ.50వేల జరిమానా విధించారు.

గజ్వేల్ పోలీస్‌స్టేషన్ సందర్శన
గజ్వేల్‌రూరల్: సీపీ శ్వేత శుక్రవారం గజ్వేల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పోలీస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.

కౌంట్‌డౌన్

4 రోజులే..

- జిల్లాలో హోరెత్తుతున్న ప్రచారం
- ఈ నెల 28వ తేదీతో ముగింపు



సాక్షి, సిద్దిపేట: పోలింగ్‌కు మరో నాలుగు రోజులే సమయం మిగిలి ఉంది. ఎన్నికల ప్రచారం ఈ నెల 28వ తేదీతో ముగియనుండగా 30న ఎన్నికలు జరగనున్నాయి. సమయం దగ్గర పడుతుండటంతో ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించారు. పోలింగ్‌కు 48 గంటల ముందే ప్రచారం నిలిపివేయనున్నారు. ఎన్నికల ప్రక్రియ చివరి అంకానికి చేరడంతో అభ్యర్థులు కంటి మీద కునుకులేకుండా ప్రచారం నిర్వహిస్తున్నారు. మరో వైపు తమ పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు అగ్రనేతలు తరలివస్తున్నారు.

అగ్రనేతల రాకతో..
ఆయా పార్టీలకు చెందిన అగ్రనేతల ప్రచారంతో జిల్లా హోరెత్తుతోంది. ఈ నెల 28 వరకు మరి కొందరు ఆయా పార్టీల ముఖ్యనేతలు సైతం రానున్నారు. ప్రచారానికి అభ్యర్థులు సర్వ శక్తులు ఒడ్డుతున్నారు. అభ్యర్థుల గెలుపు కోసం ఈ మూడు రోజులు కీలకం. ఇప్పటికే హుస్నాబాద్, సిద్దిపేట, చేర్యాలలో సీఎం కేసీఆర్, గజ్వేల్‌లో బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి, గజ్వేల్, దుబ్బాకలలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, హుస్నాబాద్‌లో ఏఐసీసీ నేత ప్రియాంక గాంధీ, దుబ్బాకలో కేసీఆర్, సిద్దిపేటలో ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. సిద్దిపేట, హుస్నాబాద్, గజ్వేల్, దుబ్బాకలలో రోడ్ షోలను మంత్రి హరీశ్ రావు నిర్వహించారు. అభ్యర్థుల గెలుపుకోసం ఆహర్నిశలు కృషి చేస్తున్నారు. వ్యూహాత్మకంగా ప్రచారాలు నిర్వహిస్తూ ఓటర్లను వారి వైపు తిప్పుకుంటున్నారు. గెలిస్తే అమలు చేసే సంక్షేమ పథకాలను చెబుతూ ఓటర్లను అభ్యర్థిస్తున్నారు.

ప్రచారాలకు పదును..
జిల్లాలో ప్రధాన పార్టీల జాతీయ, రాష్ట్ర నేతలు ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రచారాన్ని వేడెక్కిస్తున్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల ప్రచారాలకు పదును పెడుతున్నారు. ఇతర పార్టీల్లోని అసంతృప్తులను కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తూ ఓటర్లను తమ వైపు తిప్పుకుంటున్నారు. ద్వితీయ శ్రేణి నాయకుల నుంచి సామాన్య కార్యకర్త వరకు అందరినీ కలుపుకొని ప్రచారంలో ముందుకు సాగుతున్నారు.

క్లుప్తంగా

జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలు



సైక్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం రామవరం గ్రామంలో ఉమ్మడి మెదక్ జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఇందులో సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాల నుంచి సుమారు 140మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలను జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బండారుపల్లి శ్రీనివాసులు పాల్గొన్ని జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటం శ్రీనివాస్, సైక్లింగ్ జిల్లా అసోసియేషన్ ప్రధానకార్యదర్శి జంగపల్లి వెంకట నర్సయ్య, పాఠశాలల క్రీడా సమాఖ్య ఉపాధ్యక్షుడు లింగాల శైలజరెడ్డి పాల్గొన్నారు.

108 సిబ్బందికి నేషనల్ అవార్డు



అవార్డులు అందుకుంటున్న అశోక్, వెంకట్

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరు 108 సిబ్బంది నేషనల్ అవార్డు సొంతం చేసుకున్నారు. ఏప్రిల్ 5న రంగనాయక సాగర్ రిజర్వాయర్‌లో పనులు చేస్తున్న దంపతులు 23 రోజుల తమ చిన్నారికి స్నానం చేపిస్తుండగా నీళ్లు మింగి అపస్మారక స్థితికి చేరుకుంది. సమాచారం తెలుసుకున్న 108 పైలట్ వెంకట్, ఈఎంటీ అశోక్‌లు అక్కడకు చేరుకుని చిన్నారికి సీపీఆర్ చేసి ప్రాణాలు రక్షించారు. వీరి సేవలకు గుర్తింపుగా జీవీకే సంస్థ చైర్మన్ జీవీకే కృష్ణారెడ్డి చేతుల మీదుగా శుక్రవారం హైదరాబాద్‌లో నేషనల్ అవార్డును అందజేశారు.

సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు



దుబ్బాక రెవెన్యూ డివిజన్ ఏర్పాటు విషయం ఇప్పటికే సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుల దృష్టికి తీసుకెళ్లాం. వారు సానుకూలంగా ఉన్నారు. దీనికి సంబంధించిన ఫైల్ సీఎం, మంత్రిల వద్ద ఉంది. ఈ నెల 26న దుబ్బాకలో జరిగే సభలో నిర్ణయిస్తారు.

– బీఆర్ఎస్ అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయిస్తా



ఈ ఎన్నికల్లో తనను మళ్లీ ఆశీర్వదించి గెలిపిస్తే తప్పకుండా ప్రజల చిరకాల స్వప్నం దుబ్బాక రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేయిస్తా. బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో హామీ ఇచ్చి మోసం చేసింది.

– బీజేపీ అభ్యర్థి, ఎమ్మెల్యే రఘునందన్‌రావు

ముత్యంరెడ్డి కల



నా తండ్రి, మాజీ మంత్రి స్వర్గీయ చెరుకు ముత్యంరెడ్డి కల దుబ్బాక రెవెన్యూ డివిజన్‌ను తప్పకుండా సాధిస్తా. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రజల చిరకాల స్వప్నం నెరవేర్చుతా. ప్రజలు నన్ను గెలిపిస్తే వారి రుణం తీర్చుకుంటాను.

– కాంగ్రెస్ అభ్యర్థి, చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

కల నెరవేరేనా?

- దుబ్బాక రెవెన్యూ డివిజన్ చుట్టే రాజకీయాలు
- ఎన్నికల ప్రచారంలో అన్ని పార్టీలకు ప్రధాన అస్త్రం
- 26న కేసీఆర్ ప్రకటిస్తారంటున్న బీఆర్ఎస్
- గెలిపిస్తే కల నెరవేర్చుతామంటున్న కాంగ్రెస్, బీజేపీ

దుబ్బాకటౌన్ : అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పార్టీల అస్త్రం దుబ్బాక రెవెన్యూ డివిజనే. 2020 ఉపఎన్నికల సమయంలోనే డివిజన్‌గా ఏర్పాటవుతుందని ఆశించినా ప్రజలకు నిరాశే ఎదురైంది. ప్రస్తుత ఎన్నికల నేపథ్యంలో దుబ్బాకను రెవెన్యూ డివిజన్ చేయాలంటూ అన్నివర్గాల నుంచి డిమాండ్లు వినిపిస్తున్నాయి. రాష్ట్రం ఆవిర్భావం తర్వాత జిల్లాల పునర్విభజన సమయంలో సిద్దిపేట జిల్లాగా, దుబ్బాకను రెవెన్యూ డివిజన్‌గా చేస్తారని ఈ ప్రాంతం వారు ఎదురుచూశారు. కానీ అలా జరగలేదు. పాత సమితి కేంద్రంగా, తాలుకాగా, నియోజకవర్గ కేంద్రంగా మున్సిపాలిటీగా ఉన్న దుబ్బాకకు రెవెన్యూ డివిజన్‌కు కావాల్సిన అన్ని అర్హతలు ఉన్నాయి. 2016లో రెవెన్యూ డివిజన్ చేయాలంటూ దుబ్బాక పట్టణంలో 45 రోజుల పాటు ఉద్యమం జరిగింది. అప్పటి నుంచి నిరంతరం ఉద్యమాలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా ప్రజల ఆకాంక్ష దుబ్బాక రెవెన్యూ డివిజన్ చుట్టే రాజకీయాలు తిరుగుతున్నాయి.


సిద్దిపేట జిల్లాలో సిద్దిపేట జిల్లా కేంద్రంగా ఉండడంతో పాటు నియోజకవర్గ కేంద్రాలైన గజ్వేల్, హుస్నాబాద్‌లను రెవెన్యూ డివిజన్లుగా చేసి నియోజకవర్గ కేంద్రమైన దుబ్బాకను డివిజన్ చేయకపోవడం శోచనీయం.

ఆరు మండలాలతో దుబ్బాక డివిజన్

దుబ్బాక నియోజక వర్గంలో ప్రస్తుతం 8 మండలాలు ఉండగా చేగుంట, నార్సింగ్ మండలాలు తూప్రాన్ డివిజన్‌లో ఉన్నాయి. దుబ్బాక, మిరుదొడ్డి, తొగుట, దౌల్తాబాద్, రాయపోల్, భూంపల్లి-అక్బర్‌పేట మండలాలతో డివిజన్ చేస్తే ప్రజలకు అనుకూలంగా ఉంటుంది.

26న ప్రకటిస్తారని ప్రచారం

దుబ్బాక రెవెన్యూ డివిజన్ డిమాండ్‌ను సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు దృష్టికి ఇప్పటికే ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి తీసుకెళ్లాడని, ఈ నెల 26 న దుబ్బాకలో జరిగే బహిరంగ సభలో డివిజన్‌గా చేస్తున్నట్లు ప్రకటిస్తారని బీఆర్ఎస్ వర్గాలు జోరుగా ప్రచారం చేస్తున్నాయి. హరీశ్ సైతం కొత్త ప్రభాకర్‌రెడ్డిని గెలిపించండి దుబ్బాక డివిజన్ చేస్తామని రోడ్ షోల్లో హామీలు ఇస్తున్నారు.



రేవంత్ నోటా దుబ్బాక డివిజన్..

దుబ్బాకలో గురువారం జరిగిన బహిరంగ సభలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సైతం కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించండి దుబ్బాక రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది దుబ్బాక డివిజన్‌ను చేస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు.

బీజేపీ సైతం దీనిపైనే ఫోకస్

దుబ్బాకలో మళ్లీ బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావును గెలిపిస్తే తప్పకుండా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు అవుతుందని ఆ పార్టీ నాయకులు ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే రఘునందన్‌రావు సైతం భూంపల్లి-అక్బర్‌పేట కొత్త మండలం ఏర్పాటు చేశానని, దుబ్బాకను రెవెన్యూ డివిజన్ చేస్తానంటూ ప్రచారంలో ప్రజలకు వివరిస్తున్నారు.



మహిళలతో కలిసి రామక్క పాటపై నృత్యం చేస్తున్న ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

కాళేశ్వరంపై దుష్ప్రచారం సిగ్గుచేటు

- రూ.80వేల కోట్లు ఖర్చుపెడితే... లక్ష కోట్ల అవినీతి అంటారా?
- ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్ : కాళేశ్వరం ప్రాజెక్టుపై బీజేపీ నేతలు విషప్రచారం చేయడం సిగ్గుచేటని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం గజ్వేల్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని వేములగాట్, పల్లెపహాడ్, ఎర్రవల్లి గ్రామాల్లో కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రూ.80వేల కోట్ల ఖర్చుతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మిస్తే... లక్ష కోట్ల అవినీతి జరిగిందని బీజేపీ నేతలు ఆరోపించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు నిర్వాసితుల సమస్యల గురించి ఏనాడూ పట్టించుకోలేదన్నారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో 90శాతం సమస్యలను ముఖ్యమంత్రి కేసీఆర్ పరిష్కరించారని చెప్పారు. పెండింగ్ సమస్యలను ఎన్నికల తర్వాత పరిష్కరించడానికి హామీ ఇచ్చారని చెప్పారు. జూటా మాటలతో ఎన్నికల ప్రచారంలోకి వస్తున్న బీజేపీ, కాంగ్రెస్‌లను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి, సంక్షేమాన్ని కొత్త పుంతలు తొక్కిస్తున్న బీఆర్ఎస్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఎల్లం, సంధ్య, బాలమణి, నాయకులు బాలకిషన్, నాగరాజు, మల్లేశం, నగేష్, నర్సింహారెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాములు పాల్గొన్నారు. కాగా 'గులాబీల జెండాలే రామక్క' పాటపై ప్రతాప్‌రెడ్డి మహిళలతో కలిసి నృత్యం చేసి ప్రచారంలో ఉత్సాహం నింపారు.



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

కేసీఆర్‌కు మద్దతు

గజ్వేల్ : గజ్వేల్‌లో పోటీ చేస్తున్న కేసీఆర్‌కు టాక్సీ డ్రైవర్స్ అసోసియేషన్ మద్దతు ప్రకటించింది. శుక్రవారం పట్టణంలోని వైష్ణవీ గార్డెన్స్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని వంటేరు ప్రతాప్‌రెడ్డికి అందజేశారు. అదేవిధంగా ప్రైవేటు బస్సు డ్రైవర్ల అసోసియేషన్ నాయకులు సైతం మద్దతు తెలిపారు.

ప్రభుత్వ స్కీములన్నీ స్కాములే



వృద్ధులను ఓట్లు అడుగుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



బైరాన్‌పల్లి బురుజు వద్ద నివాళులర్పిస్తున్న కొమ్మూరి

- కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు
- పార్టీ జనగామ అభ్యర్థి 'కొమ్మూరి'

మద్దూరు(హుస్నాబాద్): రాష్ట్ర ప్రభుత్వ స్కీములన్నీ స్కాములేనని కాంగ్రెస్ జనగామ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం దూళ్మిట్ట మండలంలోని బైరాన్‌పల్లి, తోర్నాల, బెక్కల్, కొండాపూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణను అప్పులమయం చేశారని మండిపడ్డారు. యువతకు ఉద్యోగ అవకాశాలు లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వాపోయారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను మంజూరు చేయించానని తెలిపారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీని విమర్శించడం సరికాదన్నారు. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి భూకబ్జాలు తప్ప నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. జనగామను దోచుకునేందుకే సీఎం కేసీఆర్ పల్లాకు టికెట్ ఇచ్చారని విమర్శించారు. స్థానికేతరుడికి టికెట్ ఇచ్చినా కూడా బీఆర్ఎస్ నాయకులు ఇంకా ఆ పార్టీలో ఎందుకు ఉంటున్నారని ప్రశ్నించారు. ఎమ్మెల్సీగా ఒక్కనాడు నియోజకవర్గానికి రాని పల్లా ఇప్పుడు వచ్చి ఏం చేస్తాడన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను 100 రోజుల్లోనే అమలు చేస్తామన్నారు. రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు బైరాన్‌పల్లిలో అమరుల స్తూపం, బురుజు వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నాగపూరి రాజలింగం, జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు, బైరాన్‌పల్లి సర్పంచ్ బండి శ్రీనివాస్‌గౌడ్, యూత్ అధ్యక్షుడు చెట్కూరి కమలాకర్ యాదవ్, బెక్కల్ సర్పంచ్ కూకట్ల బాలరాజు యాదవ్, మాజీ పీఏసీఎస్ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి, నాయకులు మల్లేశం, శ్రీధర్‌రెడ్డి, కనుకచంద్రం, పద్మారెడ్డి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

'కొమ్మూరి'ని గెలిపించండి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ మండలంలోని తపాస్‌పల్లి, అయినాపూర్, కొమురవెల్లి, కిష్టంపేట, లెనిన్‌నగర్ గ్రామాల్లో మాజీ జెడ్పీటీసీ దాసరి కళావతి ఆధ్వర్యంలో గురువారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో అయినాపూర్ సర్పంచ్ చెరుకు రమణారెడ్డి, మహాదేవుని శ్రీనివాస్, లింగంపల్లి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల చేరిక..

పట్టణానికి చెందిన కాంగ్రెస్ మైనార్టీ నాయకులు జమాల్ షరీఫ్, యూత్ లీడర్ ఎండి రఫీమతిన్ ఆధ్వర్యంలో జరిగిన చేరికల కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా యువ నాయకుడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. గిర్నిగడ్డకు చెందిన బీఆర్ఎస్, సీపీఎంలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. చారబుడ్ల రాంద యాకర్‌రెడ్డి, కౌన్సిలర్ ముస్త్యాల చందర్, అబ్దుల్, మన్నన్ పాల్గొనగా, కాంగ్రెస్‌లో చేరిన వారిలో అమ్మన్, అస్లం, శ్రీకాంత్, నితిన్, నవీన్, ఫరీదా, శానాజ్, పర్వీన్, నర్సింగ్, అజిమ్, శంకర్, రాములు, సత్యనారాయణ, భరత్, నరసింహ, సాల్మన్ శానవాజ్, బాబు ఉన్నారు.

కొమ్మూరిని గెలిపించాలి

బచ్చన్నపేట: నియోజకవర్గ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పాటు పడే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని ఆదరించి గెలిపించాలని ఆయన కూతురు సాయిప్రియాంక కోరారు. గురువారం మండలంలోని కేసిరెడ్డిపల్లిలో కాంగ్రెస్ నాయకులు, మహిళలతో కలిసి ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

కొమ్మూరితోనే జనగామ అభివృద్ధి

జనగామ: స్థానికుడైన కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితోనే జనగామ సంపూర్ణంగా అభివృద్ధి చెందుతుందని ఆయన కోడలు దివ్య అన్నారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బనుక శివరాజ్ యాదవ్ ఆధ్వర్యంలో పట్టణంలోని 5వ వార్డు, కోర్టు ఏరియా, గోకుల్‌నగర్, బృందావన్ కాలనీల్లో గడప గడపకు ఆమె ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేయనున్న ఆరు గ్యారంటీ పథకాలు, ఇతర సంక్షేమ పథకాలను వివరిస్తూ చేతి గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. యూత్ కాంగ్రెస్ నాయకులు బ త్తుల శ్రీనివాస్, బైరగోని రఘు గౌడ్, శివ, రాజు, మారబోయిన రాంచందర్ పాల్గొన్నారు.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి పోటీలు

వర్గల్(గజ్వేల్): జ్యోతిబా పూలే బీసీ గురుకులాల రాష్ట్రస్థాయి బాలికల ఆటల పోటీలు హోరాహోరీగా జరిగాయి. శుక్రవారం ఆతిథ్య మెదక్‌జిల్లా క్రీడాకారిణులు ఆధిక్యత ప్రదర్శించారు.

వివిధ పోటీలలో..

డిగ్రీ విభాగం వాలీబాల్ పోటీ సెమీఫైనల్స్‌లో మెదక్ జట్టు నిజామాబాద్‌ను ఓడించి ఫైనల్‌కు చేరింది. కబడ్డీ పోటీలో నిజామాబాద్ జట్టుపై మెదక్ జయకేతనం ఎగరేసి సెమీఫైనల్ పోరుకు సిద్ధమైంది. లాంగ్‌జంప్‌లో మెదక్ క్రీడాకారిణి సీ.ఇంద్రాణి, డిస్కస్‌త్రోలో ఆర్.సుజాత విజేతలుగా నిలిచారు. 400 మీటర్లు, 100 మీటర్ల రిలే రేసు, 3000 మీటర్లు, 1500 మీటర్ల పరుగులోనూ మెదక్ క్రీడాకారిణులు విజయాలు నమోదు చేసి ఆధిక్యత చాటారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో అండర్-19, అండర్-17, అండర్-14 పోటీలకు సంబంధించి లీగ్‌దశ పోటీలు ముగింపు దశకు చేరాయి.

దుబ్బాకపై పరాయి పెత్తనమేంటి?

- చింతమడ్కకో న్యాయం..మిగతా గ్రామాలకో న్యాయమా..
- మల్లన్నసాగర్ ముంపు బాధితుల పక్షాన కొట్లాడింది నేనే
- దుబ్బాక బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్ : సీఎం కేసీఆర్ తన స్వగ్రామం చింతమడ్కలో ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షలిచ్చాడని.. మరి రాష్ట్రంలోని మిగతా గ్రామాల ప్రజలు ఏం పాపం చేశారని దుబ్బాక బీజేపీ అభ్యర్థి, ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు ప్రశ్నించారు. శుక్రవారం దుబ్బాక మండలం పోతారం, తొగుట మండల కేంద్రంతోపాటు తుక్కాపూర్ లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్లన్న సాగర్ ప్రాజెక్టులో సర్వం కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందన్నారు. వారికి అండగా నిలిచి కొట్లాడడంతోనే కొంత వరకు న్యాయం జరిగిందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాస్‌రెడ్డి వారి గురించి ఏనాడూ పట్టించుకోలేదన్నారు. తన వల్లే ముంపు గ్రామాల్లోని మత్యకారులకు చేపలు పట్టుకునే హక్కు కల్పించిందన్నారు.

సర్కార్‌ను సాగనంపుదాం

రైతుల రుణమాఫీ చేయడంలో విఫలమైన బీఆర్ఎస్ సర్కార్‌ను ఈ ఎన్నికల్లో ఇంటికి సాగనంపుదామని రఘునందన్‌రావు పిలుపునిచ్చారు. బీజేపీ అధికారంలోకి వస్తే ధాన్యానికి మద్దతు ధర రూ.3100 ఇస్తామన్నారు.



పోతారంలో మహిళలకు అభివాదం చేస్తున్న రఘునందన్‌రావు

దుబ్బాకకు న్యాయం చేస్తా..

భారీ మెజార్టీతో గెలిపించి అసెంబ్లీకి పంపిస్తే పరాయి పెత్తనం నుంచి దుబ్బాకను కాపాడి అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. తాను ఉప ఎన్నికల్లో గెలిచాకనే ప్రభుత్వంపై కొట్లాడి పెండింగ్‌లో ఉన్న చాలా పనులు పూర్తయ్యాయని చెప్పారు. తనను గెలిపిస్తే దుబ్బాకను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు.

బీజేపీలో చేరికలు..

దుబ్బాక మండలంలోని కమ్మరపల్లితో పాటు నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు రఘునందన్‌రావు సమక్షంలో బీజేపీలో చేరారు.



రఘునందన్‌రావు సమక్షంలో బీజేపీ లో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

భారీ మెజార్టీతో గెలిపించండి

దుబ్బాకరూరల్/తొగుట: ఎన్నికల ప్రచారంలో భాగంగా దుబ్బాక మండలంలోని పోతారం, తొగుట మండలంలోని తుక్కాపూర్, తొగుట గ్రామంలో రఘునందన్‌రావు ఇంటింటి ప్రచారం చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. కరోనా సమయంలో ప్రజలకు టీకాలు ఇచ్చి ఆదుకున్న ఘనత బీజేపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఒక్కొక్కరికి ఆరు కిలోల బియ్యం ఇచ్చిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ బిడ్డను ముఖ్యమంత్రిగా చేయడం ఖాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు చేస్తోందని గొప్పలు చెప్పుకుంటుందని, ధాన్యానికి డబ్బులు చెల్లించేది మాత్రం కేంద్రమేనన్నారు. రైతులకు సబ్సిడీపై ఎరువులను అందిస్తుందన్నారు. అధికారంలోకి రాగానే వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.3100 చెల్లిస్తామన్నారు. నూటికి 15శాతం జనాభా ఉన్న మాదిగలకు ఒక్క మంత్రి పదవి ఇవ్వలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగాలు లేక యువకులు రోడ్లపై తిరిగే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఉద్యోగాలు ఏమో కాని ప్రతి గ్రామంలో బెల్ట్ షాపులు వెలిశాయన్నారు. పేదల భూములను సర్కార్ లాక్కుంటుందని, సీఎం కేసీఆర్ దళిత బంధు, బీసీ బంధు పథకాలను ఒక్కరిద్దిరికి ఇచ్చి ఎస్సీ, బీసీల మధ్య చిచ్చుపెడుతున్నాడని ఆరోపించారు. మరోసారి తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని నంబర్‌వన్ చేస్తానని తెలిపారు.



బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావును గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

ఎన్నికల చిత్రాలు

తండ్రి కోసం తనయుడి ప్రచారం



చేర్యాల(సిద్దిపేట): జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డికి మద్దతుగా ఆయన కుమారుడు పల్లా అనురాగ్‌రెడ్డి శుక్రవారం పట్టణ పరిధిలోని 5వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుపై ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. అదే విధంగా రాజేశ్వర్‌రెడ్డికి మద్దతుగా బీఆర్ఎస్ రాష్ట్రనాయకుడు ఉల్లెంగుల సేవాట్రస్ట్ చైర్మన్ ఉల్లెంగుల ఏకానందం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీడీలు చుడుతున్న మహిళల వద్దకు వెళ్లి కారు గుర్తుకు ఓటేస్తే 2వేలు ఉన్న పెన్షన్ 5వేలు చేస్తారని తెలిపారు.

టీ తాగి రిలీఫ్ అవుదాం

నర్సాపూర్: నర్సాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి శుక్రవారం పట్టణ పరిధిలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇందులో భాగంగా పార్టీ నాయకులతో కలిసి ఓ హోటల్ వద్ద టీ తాగుతూ రిలాక్స్ అయ్యారు.



విద్యుదాఘాతంతో రైతు మృతి



రాములు(ఫైల్)

దౌల్తాబాద్(దుబ్బాక): విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని నర్సంపేట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దౌల్తాబాద్ మండలం నర్సంపేట గ్రామానికి చెందిన పెరమాండ్ల రాములు(47)కు శేరిపల్లి గ్రామ శివారులో వ్యవసాయ పొలం ఉంది. గురువారం రాత్రి పశువులకు నీళ్లు పెట్టడానికి పొలం వద్దకు వెళ్లాడు. గట్టు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు అతనికి తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శుక్రవారం మృతుని భార్య చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కొండపాక(గజ్వేల్): లారీ రోడ్డు పక్కన నిలిపి బహిర్భూమి కోసం వెళ్తున్న డ్రైవర్‌ను వెనుక నుంచి మరో లారీ ఢీకొట్టడంతో గాయపడ్డాడు. ఈ సంఘటన కొండపాక మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామ శివారులో రాజీవ్ రహదారిపై శుక్రవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. షోలాపూర్ చెందిన లారీ డ్రైవరు మహ్మద్ యూసుఫ్ హైదరాబాద్ నుంచి కరీంనగర్‌కు లారీని తీసుకెళ్తున్నాడు. ఈక్రమంలో బహిర్భూమికి వెళ్లేందుకు లారీని పక్కన ఆపి వెళ్తుండగా మరో లారీ ఢీకొట్టింది. దీంతో యూసుఫ్‌కు కాలు విరగడంతో పాటు గాయాలయ్యాయి. 108 సిబ్బంది బాధితుడిని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.